

వసతి గృహంలో సరైన వసతులు కల్పించాలి
జూనియర్ సివిల్ జడ్జి కిషోర్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

వసతి గృహంలో విద్యార్థులకు సరైన వసతులు కల్పించాలని న్యాయ సేవాధికార సంస్థ జూనియర్ సివిల్ జడ్జి కిషోర్ వసతి గృహ సిబ్బందిని ఆదేశించారు. శనివారం జీలుగుమిల్లిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర వసతి గృహాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని డార్మెంటరీ, వంటశాల, మూత్రశాలలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సరైన విద్యతో పాటు సరైన వసతులు కల్పించాలని వసతి గృహ సిబ్బందికి ఆదేశించారు. అదేవిధంగా నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలను విద్యార్థులకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎమ్ రాజు, వసతి గృహ సిబ్బంది ఉన్నారు.




పితాని సత్యనారాయణ



నిమ్మల రామానాయుడు



మంతెన రామరాజు



కొలుసు పార్థసారధి



ఆరిమిల్లి రాధాకృష్ణ



బడేటి చంటి

కేరింతలు.. కోపగింతలు..!



సొంగా రోషన్ కుమార్

టిడిపి, జనసేన తొలి జాబితాలో రెండు జిల్లాల్లో ఏడు స్థానాలకు అభ్యర్థులు ఖరారు
మరో ఏడుస్థానాలకు సంబంధించి వీడని సస్పెన్స్
ప్రకటించిన స్థానాలన్నింటిలోనూ టిడిపి అభ్యర్థులే
5చోట్ల తాజా, మాజీ ఎంఎల్‌ఎలే, 2 స్థానాల్లో కొత్త ముఖాలు
తాడేపల్లిగూడెం, ఉంగుటూరు స్థానాలపై వీడని ఉత్కంఠ
నూజివీడు, ఏలూరు, తణుకు, ఉండిలో అసంతృప్తి జ్వాలలు
ఇండిపెండెంట్‌గా బరిలో దిగే ఆలోచనలో ఆశావహులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

టిడిపి, జనసేన అసెంబ్లీ అభ్యర్థులకు సంబంధించి శనివారం విడుదలైన తొలి జాబితాలో ఏడు స్థానాలకు సంబంధించిన పేర్లు ఖరారయ్యాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 14 అసెంబ్లీ స్థానాలు ఉండగా తొలి జాబితాలో ఏడు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా మరో ఏడు స్థానాలకు సంబంధించి ఇంకా సస్పెన్స్ నెలకొంది. ప్రకటించిన ఏడుగురు అభ్యర్థులు టిడిపి తరపు నుంచి పోటీ చేస్తున్నవారే ఉన్నారు. జనసేనకు రాష్ట్ర వ్యాప్తంగా 24 అసెంబ్లీ, మూడు ఎంపీ స్థానాలు కేటాయిస్తున్నట్లు ప్రకటించినప్పటికీ జిల్లాలో జనసేన పోటీ చేయనున్న నియోజకవర్గాలకు సంబంధించి ఒక్క అభ్యర్థి పేరు కూడా తొలి జాబితాలో ప్రకటించకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ప్రకటించిన ఏడు స్థానాలకు సంబంధించి టిడిపి అభ్యర్థులే ఉన్నారు. ఆచంట నుంచి మాజీ ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ. పాలకొల్లు నుంచి సిట్టింగ్ ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, ఉండి నుంచి సిట్టింగ్ ఎంఎల్‌ఎ మంతెన రామరాజు ఉండగా, తణుకు నుంచి మాజీ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ, ఏలూరు నుంచి బడేటి రాధాకృష్ణ (చంటి), చింతలపూడి నుంచి సొంగా రోషన్‌కుమార్, నూజివీడు నుంచి కొలుసు పార్థసారధి పేర్లు ఖరారు చేశారు. వీరిలో ముగ్గురు సిట్టింగ్ ఎంఎల్‌ఎలు ఉన్నారు. చింతలపూడి, ఏలూరు బరిలో కొత్త ముఖాలు నిలవనున్నాయి. జనసేన, టిడిపి నాయకుల్లో ఉత్కంఠ రేపుతున్న తాడేపల్లిగూడెం, ఉంగుటూరు స్థానాలకు సంబంధించి మాత్రం తొలి జాబితాలో ప్రకటన లేకుండా పోయింది. దీంతో ఆయా నియోజకవర్గాల్లో నాయకులు, కార్యకర్తల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఈ నెల 28న తాడేపల్లిగూడెంలో టిడిపి, జనసేన ఉమ్మడి ఎన్నికల సభ జరగనుండడంతో ఆ స్థానాలకు సంబంధించి ప్రకటన చేయలేదన్నట్లు తెలుస్తోంది. ఏలూరు జిల్లా టిడిపి అధ్యక్షులుగా ఉన్న గన్ని వీరాంజనేయులకు తొలి జాబితాలో చోటు దక్కకపోవడం చర్చనీయాంశంగా మారింది. జిల్లాలో జనసేనలో కీలకనేతగా ఉంటూ తాడేపల్లిగూడెం టిక్కెట్ ఆశిస్తున్న బొలిశెట్టి శ్రీనివాస్‌కు తొలిజాబితాలో సీటు ఖరారు కాలేదు. భీమవరం నుంచి పవన్‌కళ్యాణ్ పోటీ చేస్తారన్న ప్రచారం సాగుతున్నా తొలి జాబితాలో మాత్రం ప్రకటించలేదు. దీంతో జిల్లాలోని జనసేన నాయకులు, కార్యకర్తల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. తొలి జాబితాలో స్థానం దక్కించుకున్న అభ్యర్థుల అభిమానుల్లో, నాయకుల్లో కేరింతలు వెల్లువెత్తాయి. టపాసులు పేల్చి మరీ సందడి చేశారు. తమ నాయకునికి ఇంక తిరుగులేదని, గెలుపు తమదేనంటూ నినాదాలు హోరెత్తాయి. మరోపక్క టిక్కెట్ రాని అభ్యర్థులు, వారి అనుచరగణం మాత్రం కోపోద్రిక్తులు అవుతున్నారు.

సెగలు కక్కుతున్న అసంతృప్తి జ్వాలాలు

టిడిపి, జనసేన తొలి జాబితాలో ఏడు స్థానాలకు సంబంధించి అభ్యర్థుల ప్రకటన జరిగింది. ఆయా స్థానాల్లో టిక్కెట్ రాని ఆశావహుల్లో తీవ్ర అసంతృప్తి జ్వాలలు రేగుతున్నాయి. గడిచిన ఐదేళ్లుగా నియోజకవర్గాల్లో పార్టీ తరపున పనిచేస్తున్నా తమకు టిక్కెట్ ఇవ్వకపోడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2019 ఎన్నికలకు ముందు జనసేనలో చేరిన రెడ్డి అప్పనాయుడు ఆ ఎన్నికల్లో పోటీచేసి ఓటమి చెందారు. అప్పటి నుంచి జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ఎన్నికల ప్రచారం సైతం కొనసాగిస్తున్నారు. తొలిజాబితాలో ఏలూరు నుంచి టిడిపి అభ్యర్థిగా బడేటి చంటి పేరును ప్రకటించారు. దీంతో రెడ్డి అప్పలనాయుడు, తన అనుచరగణం తీవ్ర అంసతృప్తితో ఉన్నారు. జనసేనకు రాజీనామా చేసి ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలని అప్పలనాయుడు అనుచరులు గట్టిగా పట్టుపడుతున్నట్లు సమాచారం. అదే జరిగితే టిడిపి, జనసేన అభ్యర్థికి ఎంతమేర నష్టం చేకూరుతుందో అన్న లెక్కలు కడుతున్న పరిస్థితి నెలకొంది. నూజివీడులో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉంటూ క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న ముద్దర బోయిన వెంకటేశ్వరరావును కాదని, వైసిపి నుంచి టిడిపిలో చేరిన పెనమలూరు ఎంఎల్‌ఎ చెందిన కొలుసు పార్థసారధికి టిడిపి టిక్కెట్ ఇచ్చింది. దీంతో ముద్దరబోయిన వైసిపిలో వెళ్లడానికి సైతం ప్రయత్నాలు కొనసాగించడంతోపాటు, అవసరమైతే ఇండిపెండెంట్‌గా పోటీచేయాలని ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. తణుకు నియోజవర్గానికి సంబంధించి జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా విడివాడ రామచంద్రరావు ఉన్నారు. వారాహి యాత్రలో భాగంగా తణుకులో పర్యటించిన జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ విడివాడకు టిక్కెట్ ఖాయమంటూ ప్రకటించారు. ఇప్పుడు తణుకు నుంచి టిడిపి తరపున మాజీ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పేరు ఖరారు చేశారు. దీంతో విడివాడ తీవ్ర అసంతృప్తిలో ఉన్నట్లు చెబుతున్నారు. ఆయన ఎటువంటి నిర్ణయం తీసుకుంటారోనన్న ఉత్కంఠ ఆయన అనుచరగణంలో నెలకొంది. ఉండి నియోజకవర్గ టిడిపి సిట్టింగ్ ఎంఎల్‌ఎ మంతెన రామరాజుకు అధిష్టానం మరోసారి సీటు ఖరారు చేసింది. దీంతో ఉండి టిక్కెట్ ఆశిస్తున్న మాజీ ఎంఎల్‌ఎ శివరామరాజు తీవ్ర అసంతృప్తిలో ఉన్నట్లు చెబుతున్నారు. జాబితా ప్రకటన రాగానే ఎన్నికల ప్రచారంలో ఉన్న ఆయన వెంటనే వెళ్లిపోయినట్లు తెలిసింది. ప్రకటించిన ఏడు స్థానాల్లో ఆచంట, పాలకొల్లు, చింతలపూడి స్థానాల్లో మినహా మిగిలిన నాలుగు స్థానాల్లోనూ అసంతృప్తి జ్వాలలు రేగుతున్నాయి. టిడిపి, జనసేన అధినాయకులు వీటిని ఏవిధంగా చల్లారుస్తారో వేచిచూడాల్సి ఉంది. సదరు అసంతృప్తి నాయకులు ఏవిధంగా ముందుకు సాగుతారో చూడాల్సి ఉంది.

టిడిపి, జనసేన తొలి జాబితాలో ప్రకటించిన అభ్యర్థులు వీరే

1. ఆచంట : పితాని సత్యనారాయణ (టిడిపి)
2. పాలకొల్లు : నిమ్మల రామానాయుడు (టిడిపి)
3. ఉండి : మంతెన రామరాజు (టిడిపి)
4. న్యూజివీడు : కొలుసు పార్థసారధి (టిడిపి)
5. తణుకు :ఆరిమిల్లి రాధాకృష్ణ (టిడిపి)
6. ఏలూరు : బడేటి రాధాకృష్ణ (చంటి) (టిడిపి)
7. చింతలపూడి- సొంగా రోషన్ కుమార్ (టిడిపి)

ఎన్నికల స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - ఏలూరు

సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్, ఇవిఎంల భద్రతకు అవసరమైన స్ట్రాంగ్ రూముల ఏర్పాటుకు సంబంధించి పెదపాడు మండలం వట్లూరులోని సర్‌సిఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ ఆదేశాలతో శనివారం పలు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు ఐటిడిఎ పిఒ ఎం.సూర్య తేజ, ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖజావలీ, భవానీ శంకరి, అద్దయ్య ముక్కంటి పరిశీలించారు. ప్రాంగణంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై సర్వే, సంబంధిత సిబ్బందికి సూచనలిచ్చారు. నియోజకవర్గాల వారీగా గదుల కేటాయింపు, ఆయా నియోజకవర్గాల నుంచి వచ్చే ఇవిఎంఎలు, వివి ప్యాట్లు భద్రపర్చే స్ట్రాంగ్ రూములు, అక్కడ నుంచి కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లే రూట్ మ్యాప్, భద్రత తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని తగు ఏర్పాట్లు చేసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు భద్రత తదితర అంశాలపై క్షేత్రస్థాయి పరిశీలన చేశారు.

గ్రూప్-2 పరీక్షలకు విస్తృత ఏర్పాట్లు
జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్రవ్యాప్తంగా జరుగనున్న ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-2 పరీక్షల నిర్వహణలో భాగంగా ఏలూరు జిల్లాలో పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఈ పరీక్షల సక్రమ నిర్వహణకు వివిధ కార్యక్రమాలను సమన్వయ పరచడానికి జిల్లా జాయింట్ కలక్టర్‌ని జిల్లా సమన్వయ అధికారిగా నియమించుట జరిగిందన్నారు. జిల్లాలో గ్రూప్-2 సర్వీస్ పరీక్షకు హాజరు కానున్న 13,977 మంది అభ్యర్థులకు గాను 39 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసి, ఒక్కొక్క పరీక్షా కేంద్రానికి ఒక్కొక్క చీఫ్ సూపరింటెండెంట్, ఒక్కొక్క లైజన్ ఆఫీసర్ చొప్పున 39 మంది చీఫ్ సూపరింటెండెంట్లను, 39 మంది లైజన్ ఆఫీసర్లను నియమించుట జరిగిందన్నారు. పరీక్షల మెటీరియల్ పంపిణీ నిమిత్తం 39 పరీక్షా కేంద్రాలను 19 రూట్లుగా విభజించి 19 మంది జిల్లా అధికారులను రూట్ ఆఫీసర్లుగా నియమించడం జరిగిందన్నారు. పరీక్షల సమన్వయ అధికారిగా నియమించబడిన జిల్లా జాయింట్ కలెక్టరు బి.లావణ్యవేణి అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తరపున హాజరైన సెక్షన్ అధికార్లు, చీఫ్ సూపరింటెండెంట్లు పరీక్షా పరిశీలకులు, సంబంధిత శాఖల అధికారులతో శుక్రవారం సమన్వయ సమావేశం కూడా నిర్వహించారు. జిల్లాలో గ్రూప్-2 సర్వీస్ పరీక్షకు హాజరు కానున్న అభ్యర్థుల సౌకర్యము కొరకు ఒక హెల్ప్ డెస్క్‌ను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అధికార్లు, కలెక్టర్ కార్యాలయపు సిబ్బందితో ఏర్పాటు చేయుట జరిగిందన్నారు. కంట్రోల్ రూమ్ నెం. 9491041436 ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అధికార్లు, వారి మొబైల్ నంబర్లు ఎం.మాధవీలత, సెక్షన్ ఆఫీసర్, ఎపిపిఎస్‌సి నెం.9014550897, పి.గిరిజారాణి, సెక్షన్ ఆఫీసర్, ఎపిపిఎస్‌సి నెం.9912107709 గ్రూప్-2 పరీక్షలకు హాజరుకానున్న అభ్యర్థులు ఏవిధమైన సహాయం కోసమైనా సంప్రదించవచ్చని తెలిపారు.

నేడు ఏలూరులో 144 సెక్షన్
ఎస్‌పి మేరీ ప్రశాంతి

రాష్ట్ర ప్రభుత్వం వారు నిర్వహించే గ్రూప్-2 స్క్రీనింగ్ టెస్ట్‌కు పటిష్ట భద్రతా చర్యలలో భాగంగా జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఎటువంటి ధర్నాలకు, ర్యాలీలకు, నిరసన కార్యక్రమాలకు అనుమతి లేదని జిల్లా ఎస్‌పి డి.మేరీ ప్రశాంతి తెలిపారు. ఏలూరు జిల్లా పరిధిలో ఈనెల 25వ తేదీన ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ గ్రూప్-2 స్క్రీనింగ్ టెస్ట్ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. బందోబస్తు డ్యూటీలో ఖచ్చితంగా మహిళా సిబ్బందిని నియమించి, పరీక్షకు హాజరయ్యే మహిళా అభ్యర్థులను చెక్ చేయుటకు ప్రత్యేక శ్రద్ధ వహించినట్లు తెలిపారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉండి మాజీ ఎంఎల్‌ఎ శివకు షాక్ !

సెట్టింగ్ ఎంఎల్‌ఎ రామరాజును ఎంఎల్‌ఎ అభ్యర్థిగా ప్రకటించిన టిడిపి అధిష్టానం
శివ పయనమెటోనని సర్వత్రా చర్చ
కాక పుట్టిస్తున్న ఉండి రాజకీయం

ప్రజాశక్తి - భీమవరం

ఉండి మాజీ ఎంఎల్‌ఎ వేటూరి వెంకట శివరామరాజు (కలవపూడి శివకు) టిడిపి అధిష్టానం షాక్ ఇచ్చింది. సెట్టింగ్ ఎంఎల్‌ఎ మంతెన రామరాజును రాబోయే ఎన్నికలకు ఉండి ఎంఎల్‌ఎ అభ్యర్థిగా అధిష్టానం ప్రకటించింది. దీంతో ఉండి నియోజకవర్గ రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. ఇదిలా ఉంటే శివరామరాజు పయనం ఎటో అని సార్వత్రా చర్చ సాగుతోంది. టిడిపి అధినేత చంద్రబాబు ఉండవల్లి తన నివాసంలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌తో టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థుల తొలి జాబితాను శనివారం ప్రకటించారు. దీనిలో టిడిపికి సంబంధించి 94 మంది అభ్యర్థులు, జనసేన నుంచి ఐదుగురు అభ్యర్థులను ప్రకటించారు. జిల్లాలో తణుకు, పాలకొల్లు, ఆచంటతో పాటు ఉండి నియోజకవర్గాలకు ఎంఎల్‌ఎ అభ్యర్థుల ఎంపిక తొలి జాబితాలో ప్రాధాన్యత దక్కింది. టిడిపి ఆవిర్భావం నుంచి ఉండి నియోజకవర్గంలో ఒక్కసారి మినహా మిగిలిన అన్నిసార్లూ టిడిపి విజయకేతనం ఎగరేసింది. 2009, 2014లో ఎన్నికల్లో వరుసగా రెండుసార్లు శివరామరాజు ఎంఎల్‌ఏగా గెలుపొందారు. 2019 ఎన్నికల్లో కొన్ని అనివార్య కారణాల వల్ల శివరామరాజు నరసాపురం ఎంపీగా, రామరాజు ఉండి ఎంఎల్‌ఏగా పోటీ చేశారు. అయితే ఎంపీగా శివ పరాజయం పాలవ్వడం, ఎంఎల్‌ఏగా రామరాజు గెలుపొందడం జరిగింది. అయితే కొన్నాళ్లు పాటు ఈ ఇరువురూ బాగానే ఉన్నప్పటికీ తర్వాత పరిస్థితుల ప్రభావంతో వైరుధ్యం పెరిగింది. ఇది రానురాను మరింత ముదిరి పాకమైంది. మాజీ ఎంఎల్‌ఎ, ఎంఎల్‌ఎ మధ్య సఖ్యత లేకపోవడంతో నియోజకవర్గ పార్టీలో అనేక ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ పరిణామానికి తెలుగు తమ్ముళ్ల తలలు పట్టుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ ఇరువురు వేర్వేరుగా పార్టీ కార్యాలయాలు ప్రారంభించి పార్టీ కార్యక్రమాలను కూడా వేర్వేరుగా నిర్వహించడం ప్రారంభించారు. ఎంఎల్‌ఎ రామరాజు ఇంటింటా ప్రచారం చేస్తూ ముందుకు సాగుతుంటే మాజీ ఎంఎల్‌ఎ శివరామరాజు మాత్రం తన శివ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా అనారోగ్యానికి గురైన వారికి ఆర్థిక సహకారం అందజేస్తూ వారికి అండగా నిలబడుతూ ముందుకు సాగుతున్నారు. అయితే గత కొన్ని రోజుల నుంచి ఉండి నియోజకవర్గంలో టిక్కెట్ల రగడ తారస్థాయికి చేరింది. టిక్కెట్ తనదేనంటూ ఎంఎల్‌ఎ రామరాజు, మాండేట్ తనదేనంటూ మాజీ ఎంఎల్‌ఎ శివరామరాజు బహిరంగంగా ప్రకటనలు కూడా చేసుకున్నారు. తనకు సీటు కేటాయించకపోతే ఇండిపెండెంట్ అభ్యర్థిగానైనా పోటీ చేస్తానని శివరామరాజు ఇటీవల ప్రకటించారు. ఎంఎల్‌ఎ రామరాజుకు సీటు కేటాయించకపోతే మూకుమ్మడిగా రాజీనామా చేసేందుకు ఒక వర్గం కూడా సిద్ధమైనట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో ఏర్పడిన గందరగోళ పరిస్థితులు పార్టీ అధిష్టానం దృష్టికి వెళ్లాయి. అయితే అధిష్టానం మాత్రం సెట్టింగ్ ఎంఎల్‌ఎ రామరాజు వైపు మొగ్గుచూపింది. దీంతో శివ వర్గం తీవ్ర అసంతృప్తిలో ఉంది. ఈ నేపథ్యంలో మాజీ ఎంఎల్‌ఎ శివరామరాజు ప్రయాణమెటో అన్న దానిపై సార్వత్రా చర్చ జరుగుతోంది.



టిడిపిలో నిలకడగా ఉండిపోతారా, లేక వేరే పార్టీ నుంచి పోటీ చేస్తారా, అవసరమైతే ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీకి దిగుతారా అనే దానిపై చర్చ సాగుతోంది.

శివ పయనం ఎటు... ?

ఆకివీడు :ఉండి అసెంబ్లీ స్థానం నుంచి పోటీకి సిట్టింగ్ ఎంఎల్‌ఎ రామరాజు పేరు ప్రకటించడంతో మాజీ ఎంఎల్‌ఎ వేటుకూరి శివరామరాజు పరిస్థితి అయోమయంగా మారింది. గత ఎన్నికల్లో నరసాపురం పార్లమెంటు నుంచి లోక్‌సభకు పోటీ చేసిన శివరామరాజు ఓటమి చెందారు. శివను లోక్ సభకు పోటీకి పంపడంతో ఆ స్థానం మంతెన రామరాజు (రాంబాబు)కు కేటాయించారు. రామరాజు ఉండి అసెంబ్లీ నుంచి ఎంఎల్‌ఏగా గెలుపొందారు. 2019 ఎన్నికల సమయంలోనే వీరిద్దరి మధ్య సంబంధాలు బెడిసి కొట్టాయి. అయితే నరసాపురం పార్లమెంటు నుంచి పోటీ చేసిన శివ ఓటమిపాలైన తరువాత 2023 నవంబర్ వరకూ ఆయన ఎక్కడున్నారో ఎవరికీ తెలీదు. మరలా నాలుగు నెలల క్రితం నుంచి శివ తిరిగి ఉండి నియోజకవర్గంలో చురుగ్గా తిరుగుతున్నారు. మూడు రోజుల నుంచి టికెట్ తనకు వచ్చేసిందని, ప్రకటన ఒకటే ఆలస్యం అంటూ ప్రచారం జరిగింది. ఇంతలో టిడిపి, జనసేన అభ్యర్థుల ప్రకటన రావడం ఉండి అసెంబ్లీ నుంచి సిట్టింగ్ ఎంఎల్‌ఎ రామరాజు పేరు ప్రకటించడంతో శివ కంగుతున్నారు. ఈ దశలో శివ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తారా, లేక పార్టీలోనే కొనసాగుతారా అని చర్చనీయాంశంగా మారింది.

టిడిపికి రాజీనామా చేసే యోచనలో శివ?

ప్రజాశక్తి - భీమవరం

టీడీపీకి కంచుకోట ఉండి నియోజకవర్గం లో ఆగ్రహజ్వాలలు రగులుతున్నాయి. శివరామరాజు అలియాస్ కలవపూడి శివను కదని సెట్టింగ్ ఎంఎల్‌ఎ మంతెన రామరాజుకు సీటు కేటాయించడంతో శివరామరాజు వర్గం భగ్గుమంటోంది. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ రెండు సార్లు ఎంఎల్‌ఏగా గెలిచిన శివరామరాజును పక్కన పెట్టి మంతెన రామరాజుకు టిక్కెట్ ఇవ్వడంపై ఉండి నియోజకవర్గంలోని శివరామరాజు వర్గం నివురుగప్పిన నిప్పులా రగిలిపోతోంది. అవసరమైతే ఇండిపెండెంట్‌గా గెలిపించుకుంటామంటూ రెబల్ అభ్యర్థిగా బరిలో దిగాలంటూ కేడర్ ఒత్తిడి తెస్తోంది. పక్క పార్టీలు ఎన్ని ఆశలు పెట్టినా, పదవులు ఆశ చూపినా, పార్టీ జెండా మోస్తూ ప్రజా సేవకుడిగా నియోజకవర్గ ప్రజలకు ఆత్మీయుడుగా ఉన్న శివరామరాజుకు ఎంపీ సీటు అయినా కేటాయించాలని, ఆయనకు న్యాయం చేయకుంటే మూకుమ్మడిగా రాజీనామా చేస్తామని కేడర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తుంది. ఉండి అభ్యర్థిగా టిక్కెట్ తనకే వస్తుందని ఆశలు పెట్టుకున్న శివరామరాజుకు చంద్రబాబు నమ్మకం ద్రోహం చేశారంటూ కేడర్ రగలిపోతోంది. టిక్కెట్ దక్కకపోవడంతో కలవపూడి శివ రాజీనామా చేస్తారంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది. తీవ్ర మనోవేదనకు గురైన శివరామరాజు నియోజకవర్గ ప్రజలు అభిప్రాయం తీసుకుని తన నిర్ణయం ప్రకటించే అవకాశం ఉంది. వైసిపి పార్టీ గెలుపు గుర్రాల కోసం శివపై ఫోకస్ పెట్టింది. తన నిర్ణయం కొద్ది రోజుల్లో ప్రకటిస్తానని కలవపూడి శివ తెలిపినట్లు సమాచారం.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత
మొదటి అదనపు జిల్లా జడ్జి రామగోపాల్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పర్యావరణంలో మార్పుల వల్ల వ్యాధులు ప్రబలుతాయని కావున పర్యావరణ పరిరక్షణలో అందరూ బాధ్యత వహించి పరిసరాలను పరిశుభ్రత ఉంచుకోవాలని మొదటి అదనపు జిల్లా జడ్జి జి.రామగోపాల్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్త కుమార్ ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో శనివారం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల నివారణకు మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా రామగోపాల్ మాట్లాడుతూ పరిశుభ్రమైన జీవితాన్ని అవలంభించడం ద్వారా కొన్ని వ్యాధుల నుంచి బయటపడవచ్చని సూచించారు. నేటి సమాజంలో జంక్‌ఫుడ్స్ విరివిగా తీసుకుంటున్నారని, ఇటువంటి ఆహార పదార్థాలకు దూరంగా ఉండి మంచి ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి ఆరోగ్యంగా ఉన్నప్పుడు మాత్రమే సమాజానికి మెరుగైన సేవలు అందిస్తారని కావున ప్రతిఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెట్టాలని అన్నారు. డాక్టర్ వి.భవ్యశ్రీ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి అనారోగ్యానికి గురి అయినప్పుడు అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్యుని సంప్రదించి మెరుగైన వైద్యాన్ని పొంది అనారోగ్యం నుంచి బయట పడాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ సొంత వైద్యం చేయకుండా వైద్యున్ని సంప్రదించడం మంచిదని, లేనిచో వ్యాధి ముదిరి వేరొక అనారోగ్యానికి గురవుతారని తెలియజేశారు. అనంతరం కోర్టు సిబ్బందికి, న్యాయవాదులకు చెవి, ముక్కు, గొంతుకు సంబంధించిన వ్యాధులను పరీక్షించి, వైద్య సేవలు అందించారు.

51 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు
కన్వీనర్ బి.ప్రభాకరరావు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్


ఇంటర్మీడియట్ థియరీ పబ్లిక్ పరీక్షలు మార్చి 1వ తేదీ నుంచి జరగనున్న నేపథ్యంలో శనివారం జిల్లాలోని 51 పరీక్షా కేంద్రాలకు నియమింపబడిన చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్, కస్టోడియన్, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్‌లకు సర్ సిఆర్ రెడ్డి కళాశాల, ఏలూరు మినీ ఆడిటోరియంలో ఓరియెంటేషన్ ప్రోగ్రాం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్ బి.ప్రభాకరరావు అధ్యక్షత వహించి జిల్లాలో 51 పరీక్షా కేంద్రాలకు సంబంధించి పరీక్షల నిర్వహణకు కావలసిన సూచనలు, సలహాలు అందించారు. పరీక్షలన్నీ కూడా సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతాయని, ప్రతి సెంటర్‌లోనూ ఫర్నిచర్, మంచినీరు తదితర సౌకర్యాలు ఉండాలని సూచించారు. ఈ పరీక్షల నిర్వహణపై పర్యవేక్షణ కోసం ఏలూరు, కోటదిబ్బ జూనియర్, కళాశాలలో కంట్రోల్ రూమ్ 08812-230197 నెంబర్‌తో ఏర్పాటు చేయడం జరిగినదన్నారు. విద్యార్థులను సంబంధిత కేంద్రాల్లోకి ఉదయం 8:30కు అనుమతిస్తారని, 9 గంటల తరువాత నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించరని తెలిపారు. అదేవిధంగా ప్రతి విద్యార్థి పరీక్షా కేంద్రం నుంచి మధ్యలో బయటకు రావడానికి అనుమతి లేదని, పరీక్షా కేంద్రాల యొక్క రూట్ మాప్‌లను ప్రధాన కూడలి వద్ద ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షలకు సంబంధించిన అన్ని రికార్డులను, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని, ఈ పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేయబడుతుందని, పరీక్షా కేంద్రాల పరిసరాలలో ఎక్కడా కూడా జిరాక్స్ కేంద్రాలు తీసి ఉండకూడదని తెలిపారు. అలాగే చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్‌లు ఉదయం 8:30కు మాత్రమే పోలీస్ స్టేషన్ నుంచి ప్రశ్నాపత్రాలను తీసుకుని పోలీస్ బందోబస్త్‌తో పరీక్షా కేంద్రాలకు వెళ్లాలన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలోకి సభ్యులందరూ కూడా తప్పనిసరిగా ఐడెంటిటి కార్డులను ధరించి ఉండాలని, ప్రతి పరీక్షాకేంద్రం వద్ద పోలీస్ బందోబస్త్, మెడికల్ ఫస్ట్ ఎయిడ్ సదుపాయాలు ఏర్పాటు చేయడం జరుగుతుంద తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రం సెల్‌ఫోన్ రహిత జోన్‌గా ప్రకటించడమైనదని, కావున ఏ సిబ్బంది కూడా సెల్ ఫోన్ తీసుకురాకూడదని తెలియజేశారు.



మాట్లాడుతున్న జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్ ప్రభాకరరావు

గుచ్చుకుంటున్న రాళ్లు.. సర్దుకుంటున్న నేతలు..!

'ఇవి అసలు రోడ్లేనా.. అడుగు తీసి అడుగు వేయలేకపోతున్నాం' మొర్రో అని జనం ఎంత గొంతు చించుకున్నా పట్టని నేతలకు ఎన్నికల వేళ ఆ రాళ్లే గుండెల్లో గుచ్చుకుంటున్నాయి. దీంతో అధికార వైసిపి ప్రజాప్రతినిధులకు ముచ్చెమటలు పడుతున్నాయి. ఎన్నికల షెడ్యూల్ రానుండడంతో హడావుడీగా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు గ్రామాలకు వెళ్తున్న ఎంఎల్‌ఎలకు ఆయా ప్రాంతాల ప్రజల నుంచి ఊహించని విధంగా రోడ్ల అంశంపై ప్రతిఘటన ఎదురుకావడంతో ఏం చేయాలా అని తలలు పట్టుకుంటున్న పరిస్థితి. పథకాల గురించి ఎన్ని చెబుతున్నా 'అవన్నీ చేశారు మంచిదే.. కానీ మా ఊరి రోడ్డు సంగతి ఏంటీ' అంటూ నిలదీస్తుండడంతో నేతలకు నోటిమాట రావడం లేదు. 'ఈసారి గెలవగానే రోడ్డు వేసేద్దాంలే' అని సర్దిచెప్పే ప్రయత్నం చేస్తుంటే గ్రామస్తులే కాకుండా వైసిపి నేతలు సైతం సమేమిరా అంటున్నారు. 'రోడ్డు వేస్తేనే ఓట్లు అడిగేది.. లేదంటే లేదు' అని తెగేసి చెబుతుండటంతో ఎంఎల్‌ఎలు కంగుతింటున్నారు. దీంతో హడావుడీగా తమ మాట వినే కాంట్రాక్టర్లచే టెండర్లు వేయించి కొద్దిపాటి పనులకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల ప్రస్తుతం ముమ్మరంగా రోడ్ల నిర్మాణ పనులు సాగుతున్నాయి. దీనికి ప్రధాన కారణంగా అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు ప్రజల నుంచి అసంతృప్తి సెగలు తగలడమేనని స్పష్టంగా చెప్పొచ్చు. పోలవరం నియోజకవర్గంలో 15, 20 సంవత్సరాలుగా నిర్మాణం చేపట్టని రోడ్లను సైతం ఇప్పుడు హడావుడీగా పనులు చేస్తుండటమే దీనికి నిదర్శనం. ఏదేమైనా ఎన్నికల వేళ అధికార వైసిపికి అన్ని తరగతుల ప్రజల నుంచి ప్రతిఘటన ఎదురవుతుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు. అంగన్వాడీలు, ఎస్‌ఎస్‌ఎ ఉద్యోగులు, మున్సిపల్ కార్మికులు సమ్మె చేపట్టి నిర్దిష్ట డిమాండ్లు కొన్ని సాధించుకున్నారు. ఇక ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆర్థిక బకాయిలు, ఐఆర్ కోసం వివిధ రూపాల్లో ఆందోళనలు ఉధృతం చేస్తున్నారు.



ఫలితంగా కొన్ని బకాయిలు ప్రభుత్వం చెల్లించడం ప్రారంభించింది. ఇవన్నీ చూసిన జనం పోరాడితే గాని తమ సమస్యలు పరిష్కరించదనే అంశాన్ని గుర్తించి తమ గ్రామాలకు వస్తున్న ప్రజాప్రతినిధులకు తమ డిమాండ్లు విన్పిస్తున్నారు. సంక్షేమ పథకాలే ఊపిరిగా భావించిన అధికార పార్టీకి ప్రస్తుత పరిస్థితులు మింగుడు పడటం లేదు. దీంతో హడావుడీగా కొన్ని సమస్యలైనా పరిష్కరించే దిశగా అడుగులు వేస్తున్నారు. దీంతో 'పోరాడితే పోయేదేమీ లేదు.. బానిస సంకెళ్లు తప్ప' అన్న మహాకవి శ్రీశ్రీ స్థాయిలో కాకపోయినా పోరాడితే సమస్యలు ఎంతోకొంత పరిష్కారమవుతాయని జనం చర్చించుకోవడం విశేషం.

ఇక జీలుగుమిల్లిలోని గిరిజన సంక్షేమ బాలుర వసతిగృహంలో విద్యార్థులు అస్వస్థతకు గురికావడం తీవ్ర కలకలం సృష్టించింది. గిరిజన సంక్షేమ శాఖ, విద్యాశాఖ స్పందన ఎలాగున్నా వైద్యఆరోగ్య శాఖ స్పందించిన తీరు విద్యార్థుల ప్రాణాలను కాపాడిందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. బుట్టాయగూడెం మండలం పులిరామన్నగూడెంలోని వసతి గృహంలో విద్యార్థి హత్యకు గురైనప్పుడు అధికారులు హడావుడీ చేశారు. విద్యార్థి హత్య ఘటన పక్కన పెడితే వసతిగృహాల్లో నెలకొన్న సమస్యలన్నీ బహిరంగమయ్యాయి. తినడానికి ప్లేట్లు సైతం లేవని తేలడం అందరినీ విస్మయపర్చింది. జీలుగుమిల్లి ఘటనలోనూ అవే పరిస్థితులు ప్రత్యక్షమవ్వడం బాధాకరం. గదుల్లో ఫ్యాన్లు అధ్వానంగా ఉండటం, వంట గది అపరిశుభ్రంగా ఉండటంపై జాయింట్ కలెక్టర్, ఎస్‌టి కమిషన్ సభ్యుడు తదితరులు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఆహార పదార్థాలకు అవసరమైన సరుకులు సరఫరా చేసే పంపిణీదారుడుపై, మెస్ కాంట్రాక్టర్‌పైగానీ ఎవరూ నోరు మెదపకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. అయితే ఘటన జరిగి ఐదు రోజుల తర్వాత ఆ వసతిగృహానికి వెళ్లిన డిఎంహెచ్ఒ అక్కడి పరిస్థితులు చూసి నిర్ఘాంతపోయారంటే అధికారుల నిర్లక్ష్యం ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఘటన అనంతరం అధికారుల రాకతోనైనా వార్డెన్, ప్రిన్సిపల్, ఎటిడబ్ల్యూఒ తదితరులు వసతిగృహంలో మెరుగైన వసతులు కల్పించలేకపోయినా కనీసం పరిశుభ్రంగా ఉంచడం ఏమంత కష్టం కాదు. అయితే దానికి భిన్నంగా ఇప్పటికీ వసతిగృహంలో పరిస్థితులు మెరుగుపడకపోగా నానబెట్టిన మినపప్పు దుర్వాసన వస్తుండటంతో డిఎంహెచ్ఒ ఆగ్రహం వ్యక్తం చేయాల్సిన పరిస్థితి రావడానికి ఐటిడిఎ, గిరిజన సంక్షేమాధికారుల ఉదాశీనతే కారణమని చెప్పొచ్చు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి హాస్టళ్లలో పరిస్థితులపై అధ్యయనం చేసి సౌకర్యాల మెరుగుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని జీలుగుమిల్లి ఘటన చెప్పకనే చెబుతోంది.

- వివిఎస్‌ఎస్‌వి.ప్రసాద్

కాంగ్రెస్‌కు జెట్టి రాజీనామా

జంగారెడ్డిగూడెం టౌన్ : ఆంధ్రప్రదేశ్ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు, ఎఐసిసి సభ్యులు, పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ సభ్యులు జెట్టి గురునాథరావు కాంగ్రెస్ ప్రాథమిక సభ్యత్వం నుంచి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేకి తన రాజీనామా పత్రాన్ని మెయిల్ ద్వారా పంపించి మీడియాకు విడుదల చేశారు. తన భవిష్యత్ కార్యాచరణ త్వరలో తెలియజేస్తానని మీడియా మిత్రులకు తెలిపారు.

నూతన డిఎస్‌పిగా రవిచంద్ర బాధ్యతలు

జంగారెడ్డిగూడెం టౌన్: జంగారెడ్డిగూడెం నూతన డిఎస్‌పిగా రవిచంద్ర బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు డిఎస్‌పిల బదిలీలు జరిగాయి. అందులో భాగంగా జంగారెడ్డిగూడెం టౌన్ డిఎస్‌పిగా పనిచేస్తున్న ధనుంజయుడు రిలీవ్ అవ్వగా ఆయన స్థానంలో ప్రకాశం జిల్లా నుంచి వచ్చిన రవిచంద్ర జంగారెడ్డిగూడెం టౌన్ డిఎస్‌పిగా శనివారం బాధ్యతలు స్వీకరించారు.

జీడి మామిడి తోటల సాగుపై అవగాహన

జీలుగుమిల్లి: మండలంలోని వంకవారిగూడెం పంచాయతీ పరిధిలోని వాడపల్లి నిర్వాసిత కాలనీలో శనివారం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో గిరిజన రైతులకు జీడి మామిడి సాగుపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు ఉద్యానవన శాఖ అధికారి నవీన మణిమాల తెలిపారు. ఈ సదస్సులో ఐసిఎఆర్ శాస్త్రవేత్తలు మాధవి, కల్పన, పెదబాబులు హాజరై రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీడి మామిడి సాగులో అధిక దిగుబడి కొరకు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువులు వినియోగించాలని రైతులకు సూచించారు. అధికదిగుబడి కొమ్మ కత్తిరింపు చేసుకోవడం వల్ల తక్కువ ఎత్తులోనే అధిక కాపు వచ్చి, దిగుబడి పెరుగుతుందని అన్నారు. అనంతరం గిరిజన ఉప ప్రణాళికలో భాగంగా గ్రామంలోని పలువురు గిరిజన రైతులకు ఎరువులు, కట్టర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రెసిడెంట్ కుంజా రాముడు, చాందినీరాణి, విలేజ్ అగ్రి కల్చర్ అసిస్టెంట్లు రమ్య, దుర్గ, రఘులు పాల్గొన్నారు.

హెచ్‌ఎస్‌ఆర్‌పి నంబర్ ప్లేట్లు తప్పనిసరి

ఉప రవాణా కమిషనర్ ఎస్.శాంతకుమారి

ఏలూరు: హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు కలిగి లేని కొత్త, పాత వాహనాలపై కేసులు నమోదు చేయబడతాయని ఉప రవాణా కమిషనర్ ఎస్.శాంతకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. దేశ అత్యున్నత న్యాయస్థానం, రాష్ట్ర రవాణా కమిషనర్ వారి ఆదేశాల మేరకు హెచ్‌ఎస్‌ఆర్‌పి నంబర్ ప్లేట్లు లేని రవాణా, రవాణేతర వాహనాలకు ఇకపై ఫిట్నెస్, రెన్యూవల్ చేయబడవన్నారు. కొత్త వాహనాలకు డీలర్ల వద్దనే నంబరు ప్లేట్లు బిగిస్తుండగా, పాత వాహనాలకు మార్చి ఒకటవ తేదీ నుంచి ఎస్‌ఎంఐఎ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ విధానంలో రెండు వెసులుబాట్లు కలిపిస్తున్నామని, ఒకటి డీలర్ వద్ద కాగా, మరొకటి వాహన యజమాని ఇంటి వద్దనే నంబరు ప్లేట్లు బిగించే విధానం ఉందన్నారు. వాహనదారులు ఇంకా ఏదైనా సమాచారం కావలిస్తే సంబంధిత రవాణా శాఖ కార్యాలయాన్ని సంప్రదించవచ్చునని ఆమె తెలిపారు.

ఉపాధి పనుల సోషల్ ఆడిట్‌పై పబ్లిక్ హియరింగ్

ఉంగుటూరు: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై 15వ సామాజిక తనిఖీ చేసి వాటి తాలూకా నివేదికతో శనివారం ఉంగుటూరు ఎంపిడిఒ కార్యాలయంలో పబ్లిక్ హియరింగ్ నిర్వహించారు. జిల్లా డ్వామా పీడీ ఎ.రాము ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో మండలంలో 2,217 పనులకు సంబంధించి వేజ్, మెటీరియల్ కాంపొనెంట్స్ కలిపి రూ.15 కోట్ల 54 లక్షల 68 వేల 407లు వ్యయం చేశారు. సామాజిక తనిఖీ ఎప్పటికప్పుడు గ్రామాల్లో రికార్డులు తనిఖీ చేసిన వివరాల ప్రకారం జిఐఎస్‌లో రూ.32,950, ఆర్డబ్ల్యూఎస్‌లో రూ.11,766లు తేడాలను గుర్తించి వాటిని రికవరీ చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వానికి కారణమైన పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.14 వేల ఫైన్ విధించారు. డివిఒ ఎవి విజయలక్ష్మి, ఎంపిడిఒ శాస్త్రి, ఎపిఒ మల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి, ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, ఎపిఆర్‌వో, డిఆర్‌పి, సోషల్ ఆడిట్ బాధ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం టిడిపి మ్యానిఫెస్టోలో పెట్టాలి

గన్ని వీరాంజనేయులుకు యుటిఎఫ్ నాయకుల వినతి

ఉంగుటూరు: పాత పెన్షన్ విధానాన్ని కొనసాగిస్తామని హామీ ఇస్తూ టిడిపి మేనిఫెస్టోలో చేర్చాలని కోరుతూ నారాయణపురంలో ఉంగుటూరు మాజీ ఎంఎల్‌ఎ, ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గన్ని వీరాంజనేయులుకు యుటిఎఫ్ నాయకులు శనివారం వినతిని అందజేశారు. సిపిఎస్, జిపిఎస్ విధానాల వల్ల కలిగే నష్టాలను ఉపాధ్యాయులు గన్నికి వివరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి దాశే జోగినాయుడు, జిల్లా కార్యదర్శి సిహెచ్.శ్రీధర్, గౌరవ అధ్యక్షులు శీతల సత్యనారాయణ, ఉపాధ్యక్షులు హరికృష్ణ, జిల్లా కౌన్సిలర్లు నరసింహారావు, టి.శ్రీధర్, బొమ్మిడి ప్రసాద్, గోవర్ధనరావు, తూరిక శివయ్య, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల గ్రామంలో శనివారం హోంమంత్రి తానేటి వనిత పర్యటించారు. ముందుగా చిన్న వెంకన్నను దర్శించుకున్నారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పోలీస్ స్టేషన్ నుంచి వసంత నగర్ కాలనీ ఎంట్రన్స్ వరకు నూతన సిమెంట్ సీసీ రోడ్డు ప్రారంభించారు. ద్వారకాతిరుమలలో నుంచి లక్ష్మీనగర్ కాలనీ రోడ్డుకు శంకుస్థాపన చేసి, కొబ్బరికాయ కొట్టి, రిబ్బన్ కట్ చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చిలికాని రాజాబాబు, మండల అధ్యక్షులు ప్రతాపనేని వాసు, ఎంపిపి బొండాడ నాగమణి వెంకన్న బాబు, జెడ్‌పిటిసి చిగురుపల్లి శామ్యూల్, మండల యూత్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి నాగేశ్వరావు, ఎంపిటిసి-1 రుద్ర సూర్య కళ వెంకట శివాజీ గారు, పెద్దిరెడ్డి వెంకట పద్మ జ్యోతి శ్రీనివాస్, మానుకొండ సుబ్బారావు, సర్పంచ్ కుంటం స్వర్ణత సతీష్ పాల్గొన్నారు.

నేరాలు – ఘోరాలు

లారీ డ్రైవర్ మృతి

భీమడోలు : విధి నిర్వహణలో ఉండగా ఆకస్మికంగా అనారోగ్యంపాలై ఒక లారీ డ్రైవర్ చనిపోయిన సంఘటన భీమడోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. భీమడోలు ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాల మేరకు, తమిళనాడు రాష్ట్రం అప్పురమపాలెం ప్రాంతానికి చెందిన మగేంద్రన్ రాంస్వామి(48) లారీపై తనతో పనిచేస్తున్న సహ డ్రైవర్ సుందర్ రాజన్‌తో కలిసి ఈనెల 9వ తేదీన చెన్నై నుంచి జంషెడ్పూర్ లోడ్‌తో బయలుదేరారు. అక్కడ నుంచి తిరుగు ప్రయాణంలో వారు చెన్నై వస్తుండగా మార్గమధ్యలో బుధవారం వారు భీమడోలు మండలం సూరప్పగూడెం చేరే సమయానికి అనారోగ్యం కారణంగా ఇబ్బంది ఎదుర్కొంటుండగా లారీని రోడ్డు పక్కన ఆపి రాంస్వామి కూలబడిపోయాడు. దీనిని గమనించిన తోటి సహ డ్రైవర్ సుందర్‌రాజన్ అదే లారీలో అతనిని తీసుకొని చికిత్స కోసం ఏలూరు ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. అతని పరీక్షించిన సదరు వైద్యశాల వైద్యులు అప్పటికే చనిపోయినట్లు తెలిపారు. ఈ విషయంపై సహ డ్రైవర్ సుందర్ రాజన్ భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

12 మందికి గాయాలు..

ముసునూరు: ఆటో ప్రమాదానికి గురి కావడి 12 మంది మహిళలు క్షతగాత్రులైన సంఘటన ముసునూరు మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం ముసునూరు మండలంలోని గోపవరం గ్రామంలో నాగేంద్ర స్వామి ఆలయ ప్రతిష్ట కార్యక్రమానికి విచ్చేసిన మహిళా భక్తులు చిల్లబోయినపల్లి గ్రామానికి చెందిన కొందరు మహిళలు, వివిధగేని వారి గూడెం గ్రామానికి చెందిన కొందరు మహిళలు, అమ్మపాలెం గ్రామానికి చెందిన మరికొందరు మహిళలు కోడిగుడ్ల ట్రక్ ఆటోలో వెళుతుండగా అదే ఆటో చక్రానికి, గాలి పోగ ప్రమాదానికి గురికాబడి దానంతట అదే పడిపోయింది. మహిళలు క్షతగాత్రులు కాగా ముగ్గురు మహిళలను అంబులెన్స్ ద్వారా ఏలూరు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మరికొందరిని ప్రయివేటు ఆటోల ద్వారా ఏలూరు ఏరియా ఆసుపత్రులకు తరలించి చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

టి.నరసాపురం: మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.జయ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బొర్రంపాలెం గ్రామానికి చెందిన మహిళ శనివారం తెల్లవారుజామున ఉదయం సుమారు 2 గంటల సమయంలో టాయిలెట్‌కి అని వెళ్లి తిరిగి రాలేదన్నారు. చుట్టుపక్కల బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆమె ఆచూకీ తెలియకపోవడంతో భర్త ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

మత్తు వైద్య నిపుణులు డాక్టర్ అశ్విని

ప్రజాశక్తి - భీమడోలు

రక్తదానం ప్రాణదానంతో సమానమని భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం రక్త నిల్వ కేంద్రం ఇన్‌ఛార్జి, మత్తు వైద్య నిపుణులు డాక్టర్ అశ్విని తెలిపారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అంబరుపేట గ్రామంలోని లిక్సిల్(ఇండియా) సానిటరీ వేర్ కంపెనీ కేంద్రంగా స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కంపెనీకి చెందిన ఉన్నతస్థాయి ఉద్యోగులు లోకేష్, రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో కంపెనీకి చెందిన 71 మంది అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది రక్తదానం చేశారు. రక్తసేకరణ కార్యక్రమంలో భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్ర వైద్యులకు ఏలూరుకు చెందిన ప్రభుత్వ వైద్యశాల అధికారులు, సిబ్బంది సహకారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం రక్త నిల్వ కేంద్రం ఇన్‌ఛార్జి డాక్టర్ అశ్విని మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలు సామాజిక సేవా రూపంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందన్నారు. కాని లిక్సిల్ కంపెనీ వారు సేవా కార్యక్రమాల్లో భాగంగా రక్తదానం ప్రాముఖ్యతను గుర్తించి ఆ మేరకు సిబ్బంది సహకారంతో క్యాంపు నిర్వహణ, దాదాపుగా 71 మంది రక్తదానం చేయటం అభినందనీయమని పేర్కొన్నారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం అందుబాటులో ఉన్న రక్త నిధి నిల్వ కేంద్రం ద్వారా సామాజిక ఆరోగ్య కేంద్రం ద్వారా చేపట్టే వివిధ సేవలకు అవసరమైన రక్తాన్ని అందజేస్తుందని తెలిపారు. అవసరాన్ని బట్టి తలసేమియా వ్యాధిగ్రస్తులకు సైతం తరచుగా రక్తాన్ని అందజేస్తున్నామన్నారు. అవసరమైతే ఇతర ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందే వారికి సైతం అందుబాటులో ఉన్న రక్త నిధి నిల్వ కేంద్రం ద్వారా రక్తాన్ని ఇచ్చే కార్యక్రమం కొనసాగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమాలన్నీ సజావుగా కొనసాగేందుకు సామాజిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని దాతలు, సంస్థలు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో రక్త నిధి నిల్వ కేంద్రం నిర్వహణలో సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్య పర్యవేక్షకులు డాక్టర్ ఎన్.సునీత, ఇతర వైద్యులు, సిబ్బంది తమ వంతు సహకారాన్ని అందజేస్తున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రక్త నిధి నిల్వకేంద్రం సిబ్బంది అప్పారావు, పరమేశ్వరరావు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో పాల్గొన్న అధికారులు, వైద్యులు

26న క్విట్ డబ్ల్యూటిఒ నిరసన, ప్రదర్శన

ఎపి రైతు సంఘాల జిల్లా సమన్వయ కమిటీ సమావేశం పిలుపు

ప్రజాశక్తి - ఏలూరు

ఈనెల 26న వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో ప్రపంచ వాణిజ్య సంస్థ ప్రవేశపెట్టిన ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా జిల్లాలో నిరసన ప్రదర్శనలు చేపట్టాలని ఎపి రైతు సంఘాల జిల్లా సమన్వయ కమిటీ పిలుపునిచ్చింది. శనివారం పవర్ పేటలోని అన్నే భవనంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల జిల్లా సమన్వయ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, బికెఎంయు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, నగర ప్రధాన కార్యదర్శి వి.సాయిబాబా, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు సున్నా వెంకట్రావు, ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ జిల్లా కార్యదర్శి జె.గోపి, నగర అధ్యక్షులు చక్రాల అమర కుమార్ మాట్లాడుతూ ప్రపంచ వాణిజ్య సంస్థ సమావేశం అబుదాబిలో జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో రైతాంగానికి, కార్మికులకు నష్టం కలిగించే వాణిజ్య సంస్థ ప్రతిపాదనలను నిరసిస్తూ రైతులు నిరసన ప్రదర్శనలు చేపట్టాలని కోరారు. వాణిజ్య సంస్థ ప్రతిపాదనలు వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని విమర్శించారు. ఆహార భద్రతా చట్టాన్ని నిర్వీర్యం చేయాలని ఈ ప్రతిపాదనలు సూచిస్తున్నాయని దుయ్యబట్టారు. రైతుల పంటల కొనుగోలు కేంద్రాలను రద్దు చేయాలని, వ్యవసాయ ఉత్పత్తుల కనీస మద్దతు ధరలను రద్దు చేయాలని, వివిధ దేశాల ప్రభుత్వాలని డబ్ల్యుటిఒ ఆదేశిస్తుందన్నారు. అలాంటి ఆదేశాల్ని భారతదేశం లాంటి వ్యవసాయం మీద ఆధారపడినటువంటి దేశాలు తిరస్కరించాలని డిమాండ్ చేశారు. గత కొన్ని రోజులుగా హర్యానాలో జరుగుతున్న రైతు ఉద్యమాల్లో ఐదుగురు రైతులు తమ ప్రాణాలను కోల్పోయారని, దీనికి కారణమైనటువంటి హర్యానా ప్రభుత్వంపై కేసు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. పంజాబ్ సరిహద్దులో ఈ ఘాతుకానికి పాల్పడిన కేంద్ర బలగాలు, రాష్ట్ర బలగాలకు ఆదేశాలు జారీ చేసిన హర్యానా ముఖ్యమంత్రిపైన, హర్యానా హోంమంత్రి, కేంద్ర హోంమంత్రిపైన కేసులు నమోదు చేయాలని పంజాబ్ ప్రభుత్వానికి సూచించారు. రాష్ట్రంలో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి రైతులపై కేంద్ర బిజెపి ప్రభుత్వం తీవ్రమైన దమనకాండను కొనసాగిస్తూంటే నోరు మెదకపోవటం బాధాకరమన్నారు. ఇప్పటికైనా రైతులపై కేంద్ర దమనకాండను ఖండించాలన్నారు. ఈ సమావేశంలో వివిధ రైతు, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

ఉంగుటూరు: ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ చేబ్రోలులో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తల ఆధ్వర్యంలో మానవహారం, ప్రదర్శన శనివారం నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి యువత ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. వైద్యాధికారి కె.సుబ్బరాజు వర్మ, శ్రావణ్‌రెడ్డి, ఆరోగ్య, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

టి.నరసాపురం: మండలంలోని బొర్రంపాలెం ఎంఆర్‌సి కాలనీలో శనివారం జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి సూరిబాబు చేతుల మీదుగా రూ.40 లక్షల నిధులతో సీసీ రోడ్డు, డ్రెయినేజీ, అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ ఎంఆర్‌సి కాలనీలో కరోనా వల్ల గత కాలంలో అభివృద్ధి పనులు మొదలుపెట్టి నిధులు ఆగి పోవడం వల్ల పనులు ఆపేశారన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు పర్యటించినప్పుడు గ్రామస్తులు సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని కోరడంతో ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. వైసిపి ఓటు రాజకీయం కాదని ఇచ్చిన మాటని నిలబెట్టుకునే పార్టీ అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్త ప్రకాష్ బాబు, ఎంపిటిసి కలపర్తి సుజాత, రామకృష్ణ, తోట శ్యామల పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

తమనంపూడి నాగేంద్రరెడ్డి, తండ్రి: రామచంద్రరెడ్డి అను నేను నా యొక్క పాస్‌పోర్టు పోయినది. పెనుమంట్ర నుండి ఆలమూరు వెళుతుండగా నా యొక్క పాస్‌పోర్టు పోయినది. పాస్‌పోర్టు నెంబరు **P1536329** గల పాస్‌పోర్టు ఎవరికైన దొరికిన యెడల ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

తమనంపూడి నాగేంద్రరెడ్డి
తండ్రి: రామచంద్రరెడ్డి
డోర్ నంబర్: 6-88/1ఎ, పల్లపు స్ట్రీట్,
పెనుమంట్ర మండలం, ప॥గో॥జిల్లా,
పిన్: 534124, సెల్: 9701469351

పట్టిసీమలో మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

పోలవరం: మహాశివరాత్రి మహోత్సవాల సందర్భంగా పట్టిసీమ గోదావరి మధ్యలో కొలువై ఉన్న భద్రకాళి సమేత వీరేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు పట్టిసీమ ఫెర్రి కాంట్రాక్టర్ మైగాపుల సత్యనారాయణ తెలిపారు. రెవెన్యూ, పోలీస్, ఇతర శాఖల అధికారుల సూచనలతో తమ పరిధిలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. మార్చి 8వ తేదీన పట్టిసీమలో జరుగు మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఉత్సవాలకు సంబంధించిన పనులను ఫెర్రీ కాంట్రాక్టర్ మొదలుపెట్టారు. పనులు చురుగ్గా సాగుతున్నాయని, డ్రెజ్జింగ్, పందిరి పనులు, టికెట్ కౌంటర్ ఏర్పాటు, ర్యాంప్ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. గోదావరి నదిపై భక్తులు నడిచేందుకు పంట్లుతో కాలినడక రహదారి మార్గం త్వరలో మొదలుపెట్టి ఉత్సవాలకు మూడు రోజుల ముందే పనులు పూర్తి చేయడం జరుగుతుందని ఫెర్రీ కాంట్రాక్టర్ మైగాపుల సత్యనారాయణ, బొరుసు రాంబాబు తెలియజేశారు.

అవసరాల పిల్లలు వ్యాయామం చేయాలి

ముసునూరు: ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ప్రతిరోజు నిత్యం వ్యాయామం చేసినట్లయితే మానసికంగా ఆరోగ్యకరంగా ఉంటారని ఫిజియోథెరపీ ఉపాధ్యాయులు డిఎంవి లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో అవసరాల గల పిల్లల ఇండ్లకు వెళ్లి ఫిజియోథెరపీ నిర్వహించి, వారికి ప్రత్యేక శ్రద్ధ కనబరిచే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

పెదకామనపూడిలో శంఖారావం

ముదినేపల్లి: మండలంలోని పెదకామనపూడి, చినకామనపూడి గ్రామంలో శంఖారావం పేరుతో నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ ఇన్‌ఛార్జి కొడాలి వినోద్ శనివారం ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటి ఇంటికీ తిరుగుతూ టిడిపి ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించి, గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టిడిపి-జనసేన ఉమ్మడి ప్రభుత్వాన్ని గెలిపించుకోవలసిన అవసరం ప్రజలందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎలాంటి సమస్యనైనా పరిష్కరిస్తా

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొలుసు పార్థసారథి

ముసునూరు: బిసి కమ్యూనిటీ, యాదవ సామాజికవర్గం నూజివీడు నియోజకవర్గం పరిధిలో అత్యధిక ఓట్లు ఉండటంతో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు నూజివీడు సీటు తమకు కేటాయించినట్లు టిడిపి నూజివీడు నియోజకవర్గం ఇన్‌ఛార్జి కొలుసు పార్థసారథి అన్నారు. శనివారం నూజివీడు నియోజకవర్గం బిసి(యాదవ) సామూహిక సమావేశం నియోజకవర్గ అధ్యక్షులు నక్కనబోయిన మురళీకృష్ణ(లాయర్) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కొలుసు పార్థసారథి మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో బిసి, యాదవ సామాజిక వర్గానికి ఎలాంటి సమస్య వచ్చిన ముందుండి ఆ సమస్యను పరిష్కరించే వరకు చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. అదేవిధంగా యాదవ సామాజిక నాయకులు పార్థసారథి వద్ద కొన్ని సమస్యలు ఉంచగా, వాటిని త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నూజివీడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల నాయకులు, కొలుసు రవికాంత్, గొలుసు నాగేశ్వరరావు, జోనుబోయిన రాంబాబు, చిర్రా పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు మెమో : డిఇఒ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పరీక్షలు జరుగుతున్న సమయంలో ప్రధానోపాధ్యాయురాలు పర్యవేక్షణ లేకుండా ఉండడంతో అక్కడ మాస్ కాపీ జరిగిందని గుర్తించిన జిల్లా విద్యాశాఖ అధికారి అబ్రహం ప్రధానోపాధ్యాయులకు ఛార్జ్ మెమో ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పెదవేగి మండలం విజయరాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం మధ్యాహ్నం జిల్లా విద్యాశాఖ అధికారి అబ్రహం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో పాఠశాలలో 45 తరగతుల విద్యార్థులకు ఎఫ్ఎ ఆంగ్ల పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో విద్యార్థులంతా మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన జిల్లా విద్యాశాఖ అధికారి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పర్యవేక్షణ పరీక్షల సమయంలో కరువైందని గుర్తించారు. వెంటనే ఆమెపై చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఛార్జ్ నిర్వహిస్తూ శనివారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు.

ఉపాధి పనులు చూపించాలని వినతి

ఏలూరు అర్బన్: ఏలూరు నగరంలో విలీనం చేసిన ఏడు గ్రామపంచాయతీలలో ఉన్న గ్రామీణ పేదలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం పోనంగి గ్రామ ప్రజలు ఏలూరు ఎంపిడిఒ జి.ప్రణవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమ రాజకీయ సౌలభ్యం కోసం ఏలూరు నగరంలో ఏడు గ్రామ పంచాయతీలను విలీనం చేయడం వల్ల ఆ గ్రామాల్లో ఉన్న పేదలకు ఉపాధి దొరక్క వలసలు పోతున్నారని తెలిపారు. వలసల నివారణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని ఈ గ్రామాల్లో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. పనులు లేక వేలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు ఏళ్ల నుంచి పోనంగి గ్రామంలో ఉపాధి హామీ పనులు నిర్వహించకపోవడంతో ఉపాధి కోసం ఎక్కువ కుటుంబాలు వలసలు వెళ్లారని తెలిపారు. ఉపాధి పనులు లేక కొంతమంది ఒంటరి మహిళలు ఆర్థిక ఇబ్బందులతో అప్పుల పాలవుతున్నారన్నారు. ప్రధానంగా ఏలూరు చుట్టుపక్కల గ్రామపంచాయతీలు పోనంగి, కొమడవోలు, చోదిమెళ్ళ శనివారపేట, వెంకటాపురం గ్రామాల్లో పేదలు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఉపాధి కూలీలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన, పోరాటాలకు సన్నద్ధమవుతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం ఎంపిడిఒ ప్రణవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి, కమిషనర్ దృష్టికి సమస్యను తీసుకెళ్తామని, జిల్లా అధికారుల సమక్షంలో చర్చిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రేమ కుమారి, దేవమాత, పాప, కుమారి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పౌర సరఫరాల శాఖలో పోస్టుల భర్తీకి ఎంపిక

జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా పౌర సరఫరాల మేనేజర్ కార్యాలయంలో ఒక ఏడాది పాటు తాత్కాలిక ఒప్పంద ప్రాతిపదికన పనిచేయడానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు 123 మంది హాజరైనట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. ఐదు టెక్నికల్ అసిస్టెంట్ గ్రేడ్-3 పోస్టులకు 137 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా వారి విద్యార్హతల ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలనకు 123 మంది అభ్యర్థులు హాజరైనట్లు జెసి అన్నారు. హాజరైన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలు వారి విద్యా అర్హత ఆధారంగా నియామక నిబంధనల ప్రకారం మెరిట్, రోస్టర్ పాయింట్స్ అనుసరించి ఎంపిక చేశామన్నారు. జిల్లా అధికారిక వెబ్‌సైట్ https:// eluru.ap.gov.in / notice_category / recruitmentý లో ప్రచురించట ద్వారా ఎంపికైన అభ్యర్థుల వ్యక్తిగత ఫోన్‌లకు సమాచారం తెలపడం జరుగుతుందని తెలియజేశారు.

24 గంటలూ వైద్య సేవల పట్ల హర్షం

మండవల్లి: పోరాడితే సాధించుకోలేనిదంటూ ఏమీ ఉండదని, ప్రభుత్వ ఆసుపత్రి విషయంలో అది రుజువైందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు, టి.అప్పారావు స్పష్టం చేశారు. మండవల్లిలో రోగులకు 24 గంటలు వైద్యం అందించాలని చేసిన పోరాటంలో జిల్లా వైద్య అధికారులు స్పందించి చర్యలు తీసుకోవడంపై వారు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్యాన్ని మరింత బలోపేతం చేస్తూ రోగులకు 24 గంటలు వైద్య సేవలు అందించేలా రెండు సంవత్సరాల క్రితమే చర్యలు చేపట్టిందన్నారు. అయితే వైద్యురాలి నిర్లక్ష్యంతో 24 గంటలు కాదు కదా 8 గంటలు కూడా వైద్యశాలలో అందుబాటులో ఉండి రోగులకు వైద్యం పూర్తిస్థాయిలో అందించలేకపోయారని వారు విమర్శించారు. గ్రామ సభల్లో అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి, స్పందన ద్వారా జిల్లా వైద్య అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించలేదని అన్నారు. వైద్యురాలు ఏ స్థాయిలో ప్రలోభ పెట్టిందో తెలియదు కాని 24 గంటలు వైద్య సేవలు అందించేలా జిల్లా అధికారులు చేయకపోవడంతో రాత్రి వేళల్లో వైద్యం అందక, ప్రసవ వేదనతో ఉన్న మహిళలు, ఇతరులు వైద్యం అందక అనేక ఇబ్బందులు పడుతూ వచ్చారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో రోగులకు 24 గంటలు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించాలని, లేకుంటే రోగులతో, ప్రజలతో మమేకమై నిరాహార దీక్ష చేపడతామని స్పందన ద్వారా విన్నవించుకోవడం జరిగిందన్నారు. దీంతో స్పందించిన అధికారులు మండవల్లి ప్రభుత్వ ఆసుపత్రిని 24 గంటలు వైద్యం అందించేలా చేయడం పట్ల సంతోషం వ్యక్త పరిచారు. ఈ పోరాటంలో సహకరించిన మీడియా మిత్రులకు, ప్రజలకు, అధికారులకు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. 24 గంటలు రోగులు వైద్య సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కలిగేలా ప్రచారం నిర్వహించాలని వారు కోరారు.

ఎన్నికల హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం విఫలం

టి.నరసాపురం: ఎన్నికల హామీలు అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఎఐటియుసి చింతలపూడి ఏరియా గౌరవాధ్యక్షులు టివిఎస్ రాజు విమర్శించారు. మండలంలోని మక్కినవారిగూడెం గ్రామంలో ఎఐటియుసి కార్యాలయం వద్ద శనివారం ముఠా వర్కర్స్ యూనియన్ సమావేశం మల్లెల సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన టివిఎస్ రాజు మాట్లాడుతూ రైతుల ఆందోళనలో ప్రాణాలు కోల్పోయిన రైతు శుభ్‌చరణ్ సింగ్ కుటుంబానికి కేంద్ర ప్రభుత్వం కోటి రూపాయలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి చింతలపూడి ఏరియా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలి

ఏలూరు టౌన్: విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించి మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.బాలకాశి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక స్ఫూర్తి భవనం ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బాలకాశి మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో మీటర్ రీడర్స్ 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఉద్యోగ భద్రత లేదని, స్మార్ట్ మీటర్లు వస్తున్న నేపథ్యంలో మీటర్ రీడర్స్ అందరికీ సంస్థలో ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించి షిఫ్ట్ ఆపరేటర్లుగా నియమించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సత్యనారాయణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆర్థిక స్తోమత లేని ఖైదీల విడుదలకు ఉత్తర్వులు

ఏలూరు : ఆర్థిక సహాయం కోసం పేద ఖైదీలను గుర్తించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ రాష్ట్రాలకు ఉత్తర్వులు జారీ చేసిందని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. సుప్రీం కోర్టు ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు పూచీకత్తుల జరిమానాలు చెల్లించలేక జైళ్లలో మగ్గుతున్న విచారణ, ఇతర ఖైదీల విడుదలకు పథకం అమలు అయ్యేలా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. 'పేద ఖైదీలకు మద్దతు' పథకం - సామాజికంగా వెనుకబడిన, తక్కువ-ఆదాయ వర్గాలకు చెందిన ఖైదీలకు వారి బెయిల్ ష్యూరిటీ లేదా జరిమానా మొత్తాన్ని చెల్లించడానికి ఆర్థిక స్తోమత లేని వారి విడుదలకు సహాయం చేయడం లక్ష్యంగా మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. ప్రతి జిల్లాలో 'సాధికార కమిటీ'ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

మహారాజశ్రీ ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి వారి కోర్టులో, జూనియర్ డివిజన్, తణుకు

O.S. 346/2021

మధ్య:
విజయ బ్యాంక్ Now బ్యాంక్ ఆఫ్ బరోడా, Rep. by its సీనియర్ మేనేజర్, తణుకు -వాది

మరియు

1. వేముల లక్ష్మణ, S/o. మోహనరావు, డో.నెం. 4-115, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.
2. సన్నిధిరాజు రామకృష్ణ, S/o. రామారావు, డో.నెం. 4-114, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.

-ప్రతివాదులు

ప్రకటన

పై నెంబరు గ్రంధములో మీ ఇద్దరికి ఎన్నిసార్లు సమన్లు పంపినప్పటికిన్ని సమన్లు అమలు జరుగనందున శ్రీ కోర్టు వారు పేపరు పబ్లికేషన ఉత్తర్వులు ఇచ్చియున్నారు. పై నెంబరు గ్రంధము **ది. 26-02-2024వ తేదీకి వాయిదా అయి వున్నది.** కావున మీరిద్దరు ఈ ప్రకటన వెలువబడిన 30 రోజులలో శ్రీ కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, మీ యొక్క ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలెను. మీరు శ్రీ కోర్టు వారి ఎదుట **ఉదయం గం॥ 10.30 ని॥లకు** హాజరు కావలెను. లేనిచో సదరు గ్రంధము మీ యొక్క పరోక్షములో తీర్మానింపబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో)

తణుకు 24-2-24 — **ఓ.ఎన్.కృష్ణ,** అడ్వకేట్, తణుకు, సెల్: 9848199440

మహారాజశ్రీ భీమవరం 3rd అడిషనల్ డిస్ట్రిక్ట్ మరియు సెషన్స్ జడ్జి వారి కోర్టులో

D.O.P. No. 151/2023

Between:
పిటీషనర్: నీలం ఉషారాణి
రెస్పాండెంటు: నీలం రాజేష్ అనే రాంబాబు

పిటీషనర్ తరఫు దాఖలు చేసిన పత్రికా ప్రకటన U/o. 5, రూల్ 20 CPC ప్రకారం

పై నంబరు D.O.P. లో రెస్పాండెంటుకి శ్రీ కోర్టు వారి ద్వారా పలుమార్లు నోటీసులు పంపినా తీసుకోనందున పత్రికా ప్రకటన ద్వారా సబ్‌స్టిట్యూట్ సర్వీసు నిమిత్తం కోర్టు వారి ఉత్తర్వులు జారీ చేసినారు. కావున మీరు **ది. 15-3-2024వ తేదీన ఉదయం 10.30 గంటలకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరయ్యి పై D.O.P. నందు సమాధానం తెలుపవలెను. లేనియెడల మీ పరోక్షములో తీర్మానం చేయుదురు అని యిందుమూలంగా తెలియజేయడమైనది.

అడబాల శ్రీనివాసరావు
ఇంజేటి వెంకటేశ్వర్లు
భీమవరం 20-02-2024 — అడ్వకేట్స్, భీమవరం, సెల్: 9441169939

పబ్లిక్ నోటీస్

మా క్లయింట్స్ తూర్పు గోదావరి జిల్లా, అనపర్తి మండలం, కొప్పవరం గ్రామ కాపురస్తులు 1) కర్రి శత్రుముని రెడ్డి గారి కుమారుడు **వీర వెంకట సత్యన్నారాయణ రెడ్డి** 2) డిటో మండలం కుతుకులూరు గ్రామ కాపురస్తులు నల్లమిల్లి సత్యన్నారాయణ రెడ్డి గారి కుమారుడు **సత్యనారాయణ రెడ్డి** గార్ల వద్ద నుండి తూర్పు గోదావరి జిల్లా, రాజమండ్రి పట్టణ కాపురస్తులు యాగ శ్రీనివాసు గారి భార్య **యాగ శ్రీలక్ష్మి** గారు ప్రామిసరీ నోట్లపై డబ్బులు అప్పు తీసుకొని సదరు సొమ్ముకు హామీగా ది.24-02-2011 సం॥రం తేదీన రిజిష్టర్ డిపాజిట్ ఆఫ్ టైటిల్ డీడ్, దస్తావేజు నెం:1318/2011న భీమడోలు సబ్ రిజిష్ట్రార్ వారి ఆఫీసులో మా క్లయింట్సుకు ఆస్తిని హామీగా చూపించి రిజిష్టర్ చేసియున్నారు. మా క్లయింట్స్‌కు రిజిష్టర్ డిపాజిట్ ఆఫ్ టైటిల్ డీడ్ పై గల హక్కును కోరుచూ పశ్చిమ గోదావరి జిల్లా ప్రస్తుత తూర్పు గోదావరి జిల్లా శ్రీ 9వ అదనపు జిల్లా జడ్జివారు కోర్టు, కొవ్వూరు లో O.S.No.14/2022 నంబరును దావా వేసియున్నారు. దావా పెండింగ్‌లో ఉన్నది. మా క్లయింట్సుకు అందిన సమాచారం ప్రకారం యాగ శ్రీలక్ష్మి మరియు భీమడోలు మండలం, పూళ్ళ శివారు, M.M. పురం కాపురస్తులు వట్టి రవిచంద్ర గారి భార్య వెంకట శ్రీదేవి కలసి కొన్ని పత్రాలు సృష్టించి మా క్లయింట్సుకు డిపాజిట్ ఆఫ్ టైటిల్ డీడ్ క్రింద రిజిష్టరు చేసిన ఆస్తిని, ప్రజలను మభ్యపెట్టి అమ్మాలని ప్రయత్నిస్తునట్లు తెలియవచ్చినది. వట్టి వెంకట శ్రీదేవికి ఈ దిగువ షెడ్యూలు-ఎ, షెడ్యూలు-బి ఆస్తిపై ఎటువంటి హక్కు లేదని, సదరు ఆస్తి ఎవరయినా కొన్న ఎడల నష్టపోవుదురని యావన్మందికి ఇందుమూలముగా తెలియచేయుటమైనది.

మా క్లయింట్సుకు డిపాజిట్ ఆఫ్ టైటిల్ డీడ్ క్రింద రిజిష్టరు చేశిన ఆస్తి వివరాలు

షెడ్యూల్-ఎ: పశ్చిమ గోదావరి జిల్లా, ద్వారకా తిరుమల మండలం, భీమడోలు సబు రిజిస్ట్రారు వారి ఆఫీసులో చేరిన ఐ.యస్.రాఘవాపురం గ్రామ పంచాయితీకి చెందిన ఐ.యస్.రాఘవాపురం శివారు లక్ష్మీపురం గ్రామంలోనియున్న రి.స.నెం. 153 రు య.28-00 ట్లులో తూర్పు వైపున చేర్చి య.6-74 ట్లులో పడమర వైపున చేర్చి య.3-37 ట్లు హె.1-362 ర్లు భూమికి హద్దులు: *1వ ప్రతి: తూర్పు:* కోట్ని వెంకట సత్య కిషోర్ కుమార్ గారి భూమి. *దక్షిణం:* జడ్.పి. రోడ్డు. *పడమర:* నిడమర్తి సావిత్రి గారి భూమి. *ఉత్తరం:* గయాళ్ళు. ఈ హద్దుల మధ్య య.3-37 ట్లు. *2వ ప్రతి:* సదరు గ్రామంలోని రి.స.నెం.160 రు పూరా య.3-16 ట్లులో దక్షిణం వైపున చేర్చి య.3-00 ట్లులో కాలువ నిమిత్తం పోను మిగతా య.1-80 ట్లులో దక్షిణం య.0-90 ట్లు హె.0-364 ర్లు భూమికి హద్దులు: *తూర్పు:* వీర్ల అప్పారావు గారి భూమి. *దక్షిణం:* నిడమర్తి సావిత్రి వగైరాల భూమి. *పడమర:* పుంత. *ఉత్తరం:* కోట్ని వెంకట సత్య కిషోర్ కుమార్ గారి భూమి. ఈ హద్దుల మధ్య య.0-90 ట్లు భూమి. *షెడ్యూల్- బి: 3వ ప్రతి:* సదరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం, జంగారెడ్డిగూడెం, సబుడి నిమ్మలగూడెం గ్రామ పంచాయితీకి చెందిన నిమ్మలగూడెం గ్రామం తాలూకు రి.స.నెం.94 రు దాఖలా య.18-40 ట్లులో దక్షిణం వైపున చేర్చి య.10-00 ట్లులో దక్షిణం వైపున చేర్చి య.3-00 ట్లులో కాలువ నిమిత్తం య.0-55 ట్ల భూమి పోను మిగతా య.2-45 ట్లు భూమి హద్దులు: *తూర్పు:* రోడ్డు. *దక్షిణం:* పుంత. *పడమర:* కొండ్రెడ్డి పెద రామచంద్ర రావు గారి భూమి. *ఉత్తరం:* పట్టి వెంకట శ్రీదేవి గారి భూమి. ఈ హద్దుల మధ్య య.2-45 ట్లు భూమి వెరశి మూడు ప్రతులు దాఖలా మొత్తం య.6-72 ట్లు భూమి అందలి రివాజు నీటి వనరులు నీటి బోదెలు మామూలు మార్గములు బండ్ల దారులు రాకపోకలు హక్కులు యిందలి యావత్తు ఈజుమెంటు హక్కులు సహా.

రాజమహేంద్రవరం, 25-2-2024. — **ఎస్.వీరరాఘవరెడ్డి, ఎస్.వీరేంద్రరెడ్డి,** అడ్వకేట్స్, రాజమహేంద్రవరం. సెల్: 93463 22113